www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం జులై 7 2024
5
చిత్తూరు



పూర్తి స్థాయిలో రైతు బజార్ ఆధునీకరణ



రైతు బజారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరులో రైతు బజార్‌ను పూర్తిస్థాయిలో ఆధునీకరణ చేసి అన్ని మౌలిక వసతులు కల్పించి అవసరమైన పూర్తి ఏర్పాట్లతో మరో 20రోజుల్లో రైతు బజార్‌ను పునఃప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. శనివారం స్థానిక రైతు బజార్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తాము పండించే వ్యవసాయ ఉత్పత్తులను దళారుల మధ్యవర్తిత్వం లేకుండా రైతుబజార్‌లో విక్రయించేలా చేయడమే ప్రభుత్వ ఆలోచన అన్నారు. రైతు బజార్‌లో అమ్మకాలు చేస్తున్న డ్వాక్రా మహిళల స్టాల్స్‌కు తన స్వంత నిధుల నుండి బాడుగ చెల్లిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పట్టణంలో పలు రద్దీ ప్రాంతాలలో రోడ్లపైన రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయిస్తున్న కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నదని, రైతుబజార్‌లో అమ్మకాలు జరపడం ద్వారా దళారులతో ఇబ్బందులు లేకుండా రైతులకు తగు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. రానున్న 20 రోజుల్లో రైతు బజార్‌లో పూర్తి సౌకర్యాలు కల్పించి పునః ప్రారంభానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. పట్టణంలో విక్రయదారుల కమిటీ సభ్యులు ప్రతిపాదనలతో జిల్లా కలెక్టర్, జేసి, మునిసిపల్ అధికారులతో సంప్రదించి తగు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జెసి మాట్లాడుతూ రైతులు పట్టణంలో పలుచోట్ల రద్దీ కూడళ్లలలో తమ అమ్మకాలు జరపడం ద్వారా వాహనదారులకు ఇబ్బందులు, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నదన్నారు. గత కొంత కాలంగా రైతు బజార్‌లో అమ్మకాలు లేక నష్టపోతున్నారన్నారు. ఈ విక్రయదారులను తిరిగి రైతు బజార్‌కు తరలించి రద్దీ క్రమబద్ధీకరించే చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని, ఇందుకు విక్రయదారులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ, జేసిలు రైతు బజార్ ను పూర్తిగా పరిశీలించి ఖాళీగా ఉన్న కౌంటర్‌లను శుభ్రం చేయాలని నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని రైతు బజార్ లోపల ఖాళీ ఉన్న ప్రదేశంలో మొక్కలను పెంచాలని, పరిశుభ్రంగా ఉండేలా అన్ని చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ ఏడిని ఆదేశించారు. సేంద్రీయ పంట ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీనితో పాటు వర్షం కారణంగా మురుగు నీరు పైకి రాకుండా డ్రైనేజి సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం రైతు బజార్, చర్చి వీధి వినాయక స్టోర్స్‌లో కందిపప్పు ప్రత్యేక కౌంటర్ ద్వారా రూ.165లకు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా కందిపప్పును పలువురు మహిళలకు ఎంఎల్‌ఏ, జేసి అందజేశారు. చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, ఎడి మార్కెటింగ్ పరమేశ్వరన్, డిటి కిరణ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇసుక కమిటీ చైర్మన్‌గా కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇసుక కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వాన్ని నిబంధనలను అనుసరించి ఈనెల 8వ తేదీ నుండి ఇసుకను సరఫరా చేయనున్నట్లు జిల్లాస్థాయి ఇసుక కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతానికి చిత్తూరు జిల్లాలోని పాలూరు, దిగువమాసపల్లి, బైరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు ఇసుక డిపోల నుండి సరఫరా చేయనున్నారు. టన్ను ఇసుక రూ.155, 200లుగా నిర్ణయించారు. వినియోగదారులు యూపీఐ ద్వారా నగదు చెల్లించి ఇసుకను పొందాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, వాహన నెంబరు డెలివరీ అడ్రస్ ఇవ్వాల్సి ఉంటుంది. వినియోగదారులు చెల్లించిన నగదుకు రసీదును అందిస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన డిపోలలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుకను పొందాల్సి ఉంటుంది. మొదట ఇసుక కావాలని నమోదు చేసుకున్న వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆన్లైన్లో మాత్రమే నగదు చెల్లింపులను అనుమతిస్తున్నారు. నేరుగా నగదు చెల్లింపులు అనుమతించబడవని ఇసుక కమిటీ చైర్మన్ స్పష్టం చేశారు. వినియోగదారులు ఈనెల 8వ తేదీ నుండి ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇసుకను పొందాలని సూచించారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి



పాత బస్టాండు వ్యాపారస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల, జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు అందరూ సహకరించాలని చిత్తూరు శాసన సభ్యులు గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, నగర మేయర్ అముదతో కలసి చిత్తూరు పాత బస్టాండ్ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్‌లో పండ్ల వ్యాపారులతో ఎంఎల్‌ఏ, జేసి మాట్లాడుతూ చిత్తూరు పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు అందరూ సహకరించాలని ప్రస్తుత పరిస్థితుల్లో పారిశుద్ధ్య లోపం కారణంగా డయేరియా తదితర వ్యాధులు ప్రబలడం జరుగుతున్నదన్నారు. వర్షం కారణంగా కాలువల్లో నీరు ప్రవహించేందుకు అవకాశం లేకుండా మురుగునీరు రోడ్ల పైకి రావడం వలన చాలా ఇబ్బందులు ప్రజలు ఎదుర్కోవలసి వస్తుందని దీనిని శుభ్రం చేసి ఆధునీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. పండ్ల వ్యాపారులు కూడా రైతు బజార్ల వద్దనే విక్రయాలు చేయడం ద్వారా ప్రజలు ఒకే చోట కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ అంశం పై పండ్ల వ్యాపారుల కమిటీలో చర్చించుకుని జిల్లా యంత్రాంగానికి, పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. మీ సమస్యల పరిష్కారానికి పూర్తి సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. చిత్తూరు ఆర్‌డిఓ చిన్నయ్య, శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై పూర్తి అవగాహనతో తీర్పు ఇవ్వాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భారతీయ న్యాయశాఖ చట్టాలపై జిల్లా న్యాయాధికారులు పూర్తి అవగాహనతో తీర్పు ఇవ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు సమావేశం హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, చిత్తూరు పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రావు రాఘునందన రావు ఆదేశాల మేరకు విశ్రాంత జిల్లా న్యాయమూర్తులు పివి.రాంబాబు, ఎస్.జగన్నాధం, పార్థసారథిలతో కలసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన జిల్లా న్యాయధికారులకు పరిపాలన, డిక్రీల అమలు, మనీ డిక్రీ అమలు, వివిధ రీతులు చట్టం, నిబంధనలపై ఒక్క రోజు వర్క్ షాప్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ భారతీయ న్యాయశాఖ చట్టాలపై జిల్లా న్యాయాధికారులు పూర్తి అవగాహనతో కేసులకు సంబంధించి తీర్పు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాధులకున్న సందేహాలను రిసోర్స్ పర్సన్స్ ఇంటరాక్షన్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రిసోర్స్ పర్సన్స్‌ను శాలువలతో సన్మానించి మెమెంటోలను ప్రధానం చేశారు. 1వ అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేష్, చిత్తూరు, పోక్స్ కోర్టు జిల్లా జడ్జి యన్.శాంతి, అదనపు సివిల్ జడ్జి యం.సునిత రాణి, అదనపు సివిల్ జడ్జి ఎస్‌పిడి.వెన్నిలా, 3వ అదనపు జిల్లా జడ్జి గురునాథ్, 5వ అదనపు జిల్లా జడ్జి జి.రాజగోపాల్, 10వ అదనపు జిల్లా జడ్జి రామ చంద్రడు, 4వ అదనపు జిల్లా జడ్జి అర్చన, 3వ అదనపు సివిల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు, సివిల్ జడ్జి ఎస్.విష్ణు వర్మ, 8వ అదనపు జిల్లా జడ్జి యం.శ్రీనివాస్ నాయక్, సివిల్ జడ్జి బేబీరాణీ, 1వ అదనపు సివిల్ జడ్జి సికెవి సత్యకాంత్ కుమార్, అదనపు సివిల్ జడ్జి జె.కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.



వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

నిరంతరం తెలుగుభాష సేవలో 'కళామందిరం'

నేడు ద్వితీయ వార్షికోత్సవం



ప్రజాశక్తి- గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో గంగవరం సాయిగార్డెన్ సిటీలో నిర్మించిన కళామందిరం నిరంతరం తెలుగుభాష సాహిత్య కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. 2022 జులై 9వ తేదీన పి.తులసీనాథం నాయుడు, పుష్ప దంపతులు తమ సొంత స్థలంలో సొంత నిధులతో నిర్మించిన కళామందిరంను ప్రారంభించారు. ఈరెండు సంవత్సరాల కాలంలో 150 కిపైగా కార్యక్రమాలు నిర్వహించి ప్రముఖుల మన్ననలను పొందారు. వందలాది మంది విద్యార్థులకు భాషపై పోటీలు నిర్వహించి రెండువేల మందికి పైగా పిల్లకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, పుస్తకాలు, బహుమతులు అందించారు. అంతేకాకుండా ఎంతో మంది కవులు, రచయితులు భాషాభిమానులను రప్పించి అనేక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు వారిని ఘనంగా సత్కరించిన ఘనత తెలుగు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితికి దక్కుతుంది. వేసవి సెలవులలో నైతిక విలువలపై ఉచిత శిక్షణా తరగతులను నిర్వహించి పిల్లలను చైతన్యవంతం చేశారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 2012లో స్థాపించిన నాటి నుండి ఈ పుష్కర కాలంలో 1,50,000 పుస్తకాలను రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు పంచిపెట్టిన ఘనత వీరికి దక్కుతుంది. నీతి పద్యాలు, పెద్ద బాలశిక్ష, బాలభారతం, బొమ్మల భారతం, బొమ్మల రామాయణం, బొమ్మల భాగవతం, పంచతంత్ర కథలు, తెనాలి రామకృష్ణ కథలు, అక్బర్ బీర్బల్ కథలు, నసీరుద్దీన్ కథలు, హరికృష్ణ కథలు, చిన్నబ్బా కథలు, తాళపత్ర శతకాలు, రచయితలు - శాస్త్రవేత్తలు నాయకుల జీవిత చరిత్రలు, జ్ఞాన దీపాలు, తులసాకులు, తులసీరాసలు, తులసి పుష్పాలు, ఉగాది విజయం లాంటి పుస్తకాలు పిల్లలకు తమ సొంతనిధులతో పంచిపెట్టి తమకున్న భాషాభిమానాన్ని చాటుకున్నారు. ఈ కళామందిరాన్ని మండలి బుద్ధ ప్రసాద్, జెడి లక్ష్మీనారాయణ, ఉమామహేశ్వర రావు, భూమన్, కుసుమ కుమారి, ఆయుధాల మురళి, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, పాండురంగ వీరప్రసాదు రావు, హరికృష్ణన్, వెంకటకృష్ణ లాంటి ప్రముఖులు ఎందరో తమిళనాడు కర్ణాటక, తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి విచ్చేసి అభినందించారు. తాము ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ తమకు వచ్చే జీతాన్ని మొత్తం ఇలా తెలుగుభాషా సేవకు వచ్చేస్తూ తెలుగుతల్లి ముద్దుబిడ్డలుగా గుర్తింపబడుతున్నారు. కళామందిరం ద్వితీయ వార్షికోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా వారి సేవలను కొనియాడడం సముచితం.



విషజ్వరంతో వివాహిత మృతి



జ్వరంతో మృతి చెందిన స్వాతి



తోటకనుమలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి- వి కోట: మండల పరిధిలోని తోటకనుమ పంచాయతీలో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతవారం రోజులుగా పంచాయతీలోని అన్నిపల్లెలో ఎటుచూసినా జ్వర బాధితులే కంట పడుతున్నారు. శుక్రవారం తోటకనుమకు చెందిన గంగరాజు భార్య స్వాతి (20) విషజ్వరంతో మృతి చెందింది. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. స్వాతి గత కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి ఎనిమిది నెలల చిన్నారికి కూడా జ్వరం కారణంగా పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు కుప్పం పిఈఎస్ వైద్య కళాశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంట్లోను జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులో చికిత్స చేయించుకుంటున్నా జ్వరాలు అదుపుకావడం లేదు. విషయం తెలుసుకున్న వైద్యఆరోగ్య సిబ్బంది తోటకనుమ గ్రామంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించడం, ఇటీవల కురుస్తున్న వర్షాలకు బోర్లలో కొత్తనీరు చేరడంతో నీరు కలుషితం వల్లే జ్వరాలు ప్రబలినట్లు తెలుస్తోందన్నారు. వైద్య ఆరోగ్యశాఖ జ్వరాల అదుపునకు తక్షణచర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో గోవర్ధన్, ఈవోపీఆర్డీ నరేష్‌లు తెలిపారు.

నాణ్యమైన నీటినే సరఫరా చేయాలి

శుద్ధ నీటి కేంద్రాలను తనిఖీలు చేయండి: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కాలానుగుణమైన వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా నగరంలో నాణ్యమైన నీటి సరఫరా చేయాలని, ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు పటిష్టంగా తీసుకోవాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. నగరంలో నీటి సరఫరా నాణ్యత, లీకేజీల నివారణ, నీటి శుద్ధి ప్లాంట్ల తనిఖీ తదితర అంశాలపై శనివారం సాయంత్రం ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డయేరియా, ఇతర సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం నీటిసరఫరా వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం సరఫరా చేస్తున్న బోర్ వాటర్, ఎన్టీఆర్ జలాశయం నీటి నాణ్యతను రోజువారీగా మానిటర్ చేయాలన్నారు. ప్రధానంగా పైప్‌లైన్ లో మొదట, మధ్య, చివర గృహాల వద్ద నీటినాణ్యత పరీక్షలు నిర్వహించి నమోదు చేయాలన్నారు. వార్డులవారీగా లీకేజీల నివారణకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. నగరంలోని అన్నివార్డుల పరిధిలో శుద్ధ నీటి కేంద్రాలను తనిఖీ చేయాలని, లైసెన్సులు పొందారా, సక్రమంగా రెన్యువల్ చేస్తున్నారా, శుద్ధ నీటిలో కెమికల్ కాంపోనెంట్, ఈ కోలై బ్యాక్టీరియా, పీహెచ్ వంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. నీటి సరఫరాపై నిర్దేశించిన రిపోర్టులను రోజువారీగా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఈ గోమతి, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ అరుణ

మేమింతే... తగ్గేదెలె..!

ఆధ్యాత్మిక కేంద్రాల్లో 'షాడో'లు
తిరుపతిలో అన్న కుమారుని సమీక్షలు
శ్రీకాళహస్తిలో అన్నిటికీ 'అమ్మే'
చంద్రగిరిలో 'అర్ధ'భాగమై...

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి సిటి

'ఎన్నికల్లో ఖర్చు పెట్టిన ధనాన్ని కూడేసుకునేందుకు స్థానిక ఎంఎల్‌ఎ అనుచరులు తెరదీశారు.. ఎన్నికల ఫలితాలు వచ్చి నెలలు కూడా గడవకముందే విభాగాలను పంచుకుంటున్నారు.. ప్రతి విభాగానికి ఎంఎల్‌ఎ అనుచరగణం అనధికారిక ఇన్‌ఛార్జిగా ఉంటున్నారు. ఎంఎల్‌ఎకు సంబంధించి ఏ ఫైలు వచ్చినా వారు దగ్గరుండి చూస్తారు.. అధికారుల బదిలీలు సైతం ఈ ఇన్‌ఛార్జిల చేతుల్లోనే ఉంటుంది.. ఏ పని జరగాలన్నా అనధికారిక ఇన్‌ఛార్జి చేతిలో కొంత, ఎంఎల్‌ఎకు కొంత సమర్పించుకుంటేనే ఆ పని అవుతుంది' అన్నమాట. అయితే అధికారులు మాత్రం ఈ అనధికారిక ఇన్‌ఛార్జిల పెత్తనంతో తలలు పట్టుకుంటున్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలకు నెలవైన తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరిలో ఈ థోరణి జోరుగా సాగుతోంది. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలే తప్ప అధికార హోదాలో పాల్గొనడాన్ని జనం తప్పుబడుతున్నారు.

టిడిపి, బిజెపి, జనసేన కూటమి నేతలు విభేదాలు ఎన్ని ఉన్నా పక్కన పెట్టి ఆరణి శ్రీనివాసులు గెలుపే లక్ష్యంగా పనిచేశారు. నాన్‌లోకల్‌గా ఉన్న ఆరణి శ్రీనివాసులును భారీ మెజార్టీతోనే అసెంబ్లీకి పంపించారు. తిరుపతి ఒక్క నియోజకవర్గంలోనే దాదాపు ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్ రోజు వరకూ రూ.150 కోట్లపైనే వెచ్చించారని చర్చ జరుగుతోంది. ఆ డబ్బులను ఈ రూపంలో రాబట్టుకునేందుకు తలచారేమో తెలియదు. ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు బంధువర్గం, అనుచరుగులు చిత్తూరు నుంచి తిరుపతికి వలసొచ్చేశారు. టిడిపి, జనసేన, బిజెపి పార్టీ లీడర్ల ప్రమేయం లేకుండా టిటిడి, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, తుడ, రెవెన్యూ, పంచాయతీరాజ్, స్విమ్స్, రుయా, తిరుపతి కార్పొరేషన్, అటవీశాఖ, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల్లో ఆరణి శ్రీనివాసులుకు సంబంధించిన అన్నకొడుకులు, బంధుమిత్రులు, అనుచరగణం తిష్ట వేసేశారు. ఇటీవలే మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు అన్న కొడుకు శివకుమార్ అనధికారికంగా హాజరై ఎంఎల్‌ఎకన్నా ఎక్కువ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అదితిసింగ్ సైతం ఒకింత అసహనానికి గురైనట్లు చర్చ నడిచింది. సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ పార్టీల నేతలు సైతం ఈ చర్యను ఖండించారు. ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు స్పందించి ప్రోటోకాల్ పాటిస్తారని అందరూ అనుకున్నారు. అయితే 'మేమింతే తగ్గేదెలె' అంటూ అనధికారిక ఇన్‌ఛార్జిల తీరు ఉంది. తిరుపతిలో షాడో ఎంఎల్‌ఎగా ఆరణి శ్రీనివాసులు అన్న జయరాం కుమారుడు ఆరణి శివకుమార్ అన్నీ తానై వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఆరణి శ్రీనివాసులు సొంత కుమారులైన ఆరణి జగన్, ఆరణి మదన్‌లను సైతం పక్కన పెట్టడం, కూటమి నేతలను పట్టించుకోకపోవడం సొంత పార్టీలోనే కుంపటి రగిలేలా ఉంది. బదిలీలు సైతం వీరి చేతిలోనే ఉండడంతో ఆరణి శ్రీనివాసులు ఇంటి చుట్టు పోలీసు అధికారులు తమను బదిలీ చేయొద్దంటూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

శ్రీకాళహస్తిలో అన్నీ అమ్మే

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కుమారుడు బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపొందారు. ఫలితాల అనంతరం వారం రోజుల పాటు విజయోత్సవాల్లో పాల్గొన్న అనంతరం ఎంఎల్‌ఎ తల్లి బృందమ్మ చక్రం తిప్పడం మొదలు పెట్టారు. శ్రీకాళహస్తి ఆలయంలో అధికారులతో సమావేశాలు నిర్వహించి, అన్ని విషయాలు తనకు తెలియజేయాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. గతంలో బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డి మంత్రిగా ఉన్నపుడూ ఆమె ఆలయ వ్యవహారాలను పర్యవేక్షించేవారు. ఇపుడు కొడుకు హయాంలోనూ ఆమె కనుసన్నల్లోనే సాగుతున్నట్లు చర్చ నడుస్తోంది. మాజీ మంత్రి బొజ్జల 'ముద్ర' వేయడానికే బృందమ్మ ప్రయత్నిస్తున్నారని ఆ పార్టీ నేతలు చెబుతుండటం గమనార్హం.

అధికారంలోనూ అర్ధబాగమై

భార్యాభర్తలు ఇద్దరూ సమానమే అన్న నినాదం చంద్రగిరిలో ఎంచక్కా సాగిపోతోంది.. చంద్రగిరి ఎంఎల్‌ఎ పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పార్టీ నాయకులతోనూ, కార్యకర్తలతోనూ మండల, గ్రామస్థాయి సమావేశాలను నిర్వహిస్తూ అన్నీ తానే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పించన్ల పంపిణీలోనూ ప్రోటోకాల్ పాటించకుండా ఉండటం వివాదాస్పదం అవుతోంది. ఎంఎల్‌ఎ కంటే ఆమెను ప్రసన్నం చేసుకుంటే చాలన్న చర్చ చంద్రగిరి నియోజకవర్గంలో నడుస్తుండటం గమనార్హం.

'హంద్రీ - నీవా' పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి- ఐరాల: ఐరాల మండలం ఐకె.రెడ్డిపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హంద్రీనీవా ప్రాజెక్టు కాలువ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో హంద్రీనీవా పనులు నత్తనడకన సాగాయని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వేగవంతంగా తాగు, సాగునీటి ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని అన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టును కూడా త్వరలోనే పూర్తిచేసి రాయలసీమ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. అలాగే కొండపై అసంపూర్తిగా ఉన్న శివాలయంను పరిశీలించారు. గ్రామంలోని డ్వాక్రా మహిళలతో ఎమ్మెల్యే మాట్లాడి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను, సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే గ్రామంలో కనీస సౌకర్యాలను పూర్తిస్థాయిలో గ్రామ ప్రజలకు అందిస్తామని ఎమ్మెల్యే మురళిమోహన్ హామీ ఇచ్చారు.

నగర అభివృద్ధి కోసం

ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరాన్ని అభివృద్ధి చేయడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం స్థానిక పెన్షన్ భవన్‌లో చిత్తూరు స్మార్ట్‌సిటీ అండ్ డెవలప్మెంట్ సొసైటీ వారు ఎమ్మెల్యేకు మెమెంటో ఇచ్చి శాలువతో సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో నగర మేయర్ ఆముద, డిప్యూటీ మేయర్, రాజేష్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం చేసి 21రోజులు అయ్యిందని, కాస్త సమయం ఇస్తే అన్ని అవగాహన చేసుకుని నగర అభివృద్ధికై అధికారులతో చర్చించి ఒక రూపు, తీరు తీసుకొస్తానన్నారు. దీనికి అన్ని పార్టీల, ప్రజల, అధికారుల సహాయ సహకారాలు కావాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో, ఆర్థిక వనరులు చూసుకుని ఒక్కొక్కటిగా సాధించుకుంటూ ముందుకెళ్తానన్నారు. అంతకుమునుపు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజును సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో సిఎస్‌సిడిఎస్ కార్యదర్శి శివకుమార్, వైస్ ప్రెసిడెంట్లు సత్య, గోపి నాయక్, శోభారాణి, మురళి, శ్రీనివాసమూర్తి, రాజేంద్ర, చంద్ర పాల్గొన్నారు.

అవినీతి సిడిపిఓపై చర్యలు తీసుకోవాలి

అక్రమంగా వర్కర్స్ వేతనాల్లో కోతలు

ప్రశ్నిస్తే బెదిరింపులు

యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: కార్వేటినగరం ప్రాజెక్టులో వర్కర్స్ వేతనాలు కోత విధిస్తూ, అక్రమ వసూళ్లు చేస్తున్న అవినీతి సిడిపిఓపై చర్యలు తీసుకోవాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు శనివారం ఓ ప్రకటలో డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో ఓ నాయకురాలిని అడ్డం పెట్టుకొని వర్కర్స్‌ను బెదిరిస్తూ అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరైనా అడిగినంత ఇవ్వకపోతే వారిని రకరకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. విజిట్ పేరుతో బెదిరిస్తూ మీపై ఫిర్యాదులు అందాయని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. 'పిడి నేను చెప్పిందే చేస్తుందని కాబట్టి నేను అడిగింది మీరు ఇవ్వాలని' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నదన్నారు. కొంతమందిపై కక్షకట్టి ప్రతినెలా ఉద్దేశపూర్వకంగా వేతనాల్లో కోత విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఆర్ పురం మండలంలో కొంతమంది నాయకులు వేతనాల్లో ప్రతినెలా కొత్త విధిస్తున్నదని, అడిగితే సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఇలాంటి అవినీతి అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కళాశాల ఆవరణాన్ని

పచ్చగా మార్చడమే లక్ష్యం



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, ఎన్ఎస్-ఎస్ అధికారిణి డాక్టర్ సి.మంగళగౌరి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు వివిధ రకాల మొక్కలను నాటారు. కళాశాల ఆవరణాన్ని పచ్చగా మార్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల ప్రాముఖ్యతను డాక్టర్ బి.అన్నపూర్ణ శారద విద్యార్థులకు వివరించారు.

పరిశుభ్రతతోనే డెంగీ నివారణ

ప్రజాశక్తి - రామకుప్పం: ఇంటి పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని డాక్టర్ దీప పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎస్టీ బాలుర పాఠశాలలో విద్యార్థులకు డెంగీ వ్యాధిపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో, ఇంటి పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో వేపాకుతో పొగ, దోమ తెరలు వాడుకోవాలన్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. జ్వరం ఉన్నవారు ప్రాథమిక ఆసుపత్రిలో రక్తపరీక్షలు చేసుకొని చికిత్సలు అందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాకు 18,500 డోసుల ఏఆర్‌వి వ్యాక్సిన్ సరఫరా: కలెక్టర్



పెంపుడు జంతువుల వ్యాక్సినేషన్ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుండి జంతువులకు సంక్రమించు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశు సంవర్ధక శాఖ, బహువిధ పశు వైద్యశాల కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, నగర మేయర్ అముద, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ప్రభాకర్ పాల్గొన్నారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ ర్యాబిస్ వ్యాధి టీకాలను వేయడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జంతువులతో మానవుని సహచర్యం ఎంతో ప్రాచీనమైనదని తెలిపారు. మనుషులు, పశువుల సహచర్యంతో జూనోటిక్ వ్యాధులు సంక్రమిస్తాయని జంతువుల నుండి మనుషులకు, మనుషుల నుండి జంతువులకు సంక్రమించే వ్యాధులను 280 వరకు గుర్తించబడ్డాయని తెలిపారు. ఈ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు 18,500 డోసుల ఏఆర్‌వి వ్యాక్సిన్ సరఫరా చేయడం జరిగిందని, ఈ వ్యాక్సిన్‌ను జిల్లాలో అన్ని వెటర్నరీ ఆసుపత్రులలో, రైతు సేవాకేంద్రాలలో అందుబాటులో ఉంటూ ఉచితంగా కుక్కలకు వేయడం జరుగుతుందని తెలిపారు. ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా చిత్తూరు పట్టణంలో పెంపుడు కుక్కలు, వీధి కుక్కల ద్వారా ప్రజలకు ఎటువంటి హాని జరగకూడదని ఒక ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి దాదాపు 1500 కుక్కలకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వ్యాక్సిన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ వ్యాక్సిన్‌లు కుక్కలకు ఇవ్వడం ద్వారా అవి మనుషులను కరిచినప్పుడు వాటి వలన వచ్చే వ్యాధుల నుండి మనుషులను కాపాడవచ్చునని తెలిపారు. జూనోటిక్ వ్యాధులకు సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నందు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

బంగారుపాళ్యం: రాబిస్ వ్యాధి రాకుండా ముందస్తు టీకాలు వేస్తున్నట్టు సహాయ సంచాలకులు డాక్టర్ ఆసిఫ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పశువైద్య ఆసుపత్రిలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకొని పెంపుడు కుక్కలకు టీకాలు వేయడం జరిగింది నలగాంపల్లి డాక్టర్ వాకాడ ఝాన్సీ, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ యాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని అన్ని పశు వైద్య కేంద్రాల పరిధిలో 51 కుక్కలకు యాంటీ రేవిస్ టీకాలను వేసినట్టు సోమల పశు వైద్యశాల సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు తెలిపారు. పశు వైద్యాధికారిణి చందన ప్రియ మాట్లాడుతూ జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులలో ముఖ్యంగా బర్డ్ ఫ్లూ, రేబిస్ వ్యాధి, మెదడువాపు, ఆంత్రాక్స్ క్షయ వ్యాధి సంక్రమించే అవకాశం ఉందని కావున ప్రతి ఒక్కరూ వెంపుడు జంతువులకు పశువులకు గొర్రెలు మేకలకు వ్యాధులు రాకుండా అంటు వ్యాధులు ప్రబలకుండా టీకాలు తప్పనిసరిగా వేయించాలని కోరారు.

విద్యా సామగ్రి వితరణ



ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని కల్లుపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శనివారం హైదరాబాద్ నగరానికి చెందిన బిఎస్ఎన్ఎల్ ఏజీఎం రిటైర్డ్ అధికారి ఏ.శ్రీనివాసులు రూ.5వేలు విలువైన పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్లు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు దామోదరం తెలియజేశారు. దాత మాట్లాడుతూ ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని పాఠశాలకు గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని అన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజు, మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు దాత శ్రీనివాసులుని అభినందించారు.

నీటి సమస్య పరిష్కారం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని వినాయక పురంలో నీటిసమస్య పరిష్కారానికి నగరపాలక అధికారులు చర్యలు తీసుకున్నారు. వినాయక పురంలోని బోరులో నీరు అడుగంటడంతో నీటిఎద్దడి కారణంగా ప్రజల ఇబ్బందులు పడుతున్నట్లు అందిన ఫిర్యాదుపై నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ స్పందించి చర్యలకు ఆదేశించారు. నగరపాలక ఇంజనీరింగ్ అధికారులు ఏఆర్ టాప్ లైన్ సంపు నుంచి నూతనంగా పైప్‌లైన్ నిర్మించి వినాయకపురంలోని పైప్ లైన్లలకు అనుసంధానం చేశారు. దీంతో వినాయకపురంకు నీటి సరఫరా పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరి

పీహెచ్ సీ వైద్యాధికారిణి డాక్టర్ దుర్గాదేవి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు

టీబీ జబ్బు నివారణ కోసమే బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని డాక్టర్ దుర్గాదేవి అన్నారు. శనివారం మండలంలోనీ ఎన్టీఆర్ కాలనీ వద్ద పలువురు మహిళలకు బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. దుర్గాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు టీబీ జబ్బు రాకుండా నివారించాలంటే బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు పైబడిన వారు బీసీజీ వ్యాక్సిన్ వేసుకుంటే టీబీ జబ్బు రాదని, అలాగే 60 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు, ధూమపానం పొగాకు అలవాటు ఉన్నవారు బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు బీసీజీ వ్యాక్సిన్ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సిహెచ్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో అబ్బురపరిచే సర్జరీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

చంకలో కణితి ఉన్న స్వామి (62)కి ఆస్టర్ నారాయణాద్రిలో అబ్బురపరిచేలా సర్జరీ జరిగిందని సిఒఒ డాక్టర్ శ్రీధర్ ముని తెలిపారు. రేణిగుంట రోడ్డులోని ఆ హాస్పిటల్ వద్ద శనివారం ఆయన విలేకరితో మాట్లాడుతూ 62 సంవత్సరాల స్వామి అనే వ్యక్తి కుడి చంకలో కణిత పెరగడంతో ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్ లోని ప్లాస్టిక్ సర్జరీ డాక్టర్ డి. విజయ్ కుమార్ రెడ్డిని ఇటీవల సంప్రదించారు. కొవ్వు కణితలు సాధారణం అయినప్పటికి ఛాతి నుండి మొదలయి చేతి వరకు ఉండడం చాలా అరుదని పేర్కొన్నారు. ఆపరేషన్ తరువాత ఆ పేషెంట్ కు మునుపటి ఇబ్బందులన్నీ తగ్గిపోయి హాయిగా జీవిస్తున్నట్లు రోగి స్వామి వైద్యులకు వివరించారు.

శరవేగంగా కాలువల్లో పూడిక తీత పనులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్' కాలానుగుణమైన వ్యాధుల నియంత్రణలో భాగంగా నగరంలోని అన్ని మేజర్, మీడియం, మైనర్ డ్రైనేజీల్లో యుద్ధప్రాతిపదికన పూడికతీత, శుభ్రత పనులు జోరందుకున్నాయి. డ్రైనేజీల్లో పూడికతీత పనులను నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. యాక్షన్‌ప్లాన్ ప్రకారం రోజువారీగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు జరగాలన్నారు. వార్డుల పరిధిలో మీడియం, మైనర్ డ్రైన్లను గ్యాంగ్ వర్కులు నిర్వహించి శుభ్రం చేయించే పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. మేజర్ డ్రైనేజీ కాలువలో జేసీబీలతో చేస్తున్న పూడికతీత పనులపై అధికారులతో చర్చించారు. మొత్తం 40 కిలోమీటర్ల మేజర్ కాలువలు ఉండగా ఇప్పటివరకు 9.5 కిలోమీటర్లు మేర పూడిక తొలగించినట్లు అధికారులు వివరించారు. ఇదే సమయంలో దోమల నియంత్రణ చర్యల్లో భాగంగా స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవడం, వ్యర్థాలను ఒకే చోట పడేయకుండా చూడడం, సదరు ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం వంటి పనులు వేగవంతం చేయాలన్నారు. స్టాప్ డయేరియా, కాలానుగుణమైన వ్యాధుల నియంత్రణ కోసం నగరపాలక సంస్థ చేస్తున్న పనులకు నగర ప్రజలు తమ వంతు సహకారం అందించాలని, వ్యర్థాలను కాలువలు, వీధుల్లో పడేయరాదని, ఖాళీస్థలాలను సంబంధిత యజమానులు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



మురికి కాలువలు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

యథేచ్ఛగా గ్రానైట్ రవాణా

చోద్యం చూస్తున్న అధికారులు



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలో గ్రానైట్ లారీలు యథేచ్ఛగా చిత్తూరు వైపు వెళ్తున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఉదాహరణ స్థానికులు అడ్డుకున్న గ్రానైట్ లారీనే... గ్రానైట్‌ను లారీలో తరలించాలంటే కనీస భద్రత కూడా లేకుండా రవాణా చేస్తున్నారు. దీని వలన ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సుమారు 30టన్నుల గ్రానైట్‌లను ఎటువంటి భద్రతా చర్యలు పాటించకుండా ప్రజలు, వాహనదారులు తిరిగే మార్గంలో పట్టపగలే యథేచ్ఛగా చిత్తూరు గ్రానైట్ క్వారీకి తరలిస్తున్నారు. ఈ దృశ్యం కొత్తపల్లి మిట్టలో ఉన్న సిసి కెమెరాలోనిదని స్థానికులు తెలుపుతున్నారు. గ్రానైట్ వ్యాపారులు అధికారులతో లోపాయి కారి ఒప్పందం కుదుర్చుకుని ప్రకృతి సంపదను ధ్వంసం చేస్తూ పర్యావరణాన్ని వినాశనానికి పరోక్షంగా కారణమవుతున్నారని ఆరోపిస్తున్నారు. భారీ బరువు ఉన్న లారీలు నిత్యం ఈ మార్గాల గుండా వెళ్లడం వలన రహదారులు కూడా ధ్వంసం అవుతున్నాయని స్థానికులు తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు మేల్కొని తగుచర్యలు తీసుకుని పర్యావరణ సంరక్షణకు నడుం బిగించాలని కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ప్రజాశక్తి- పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు ఆస్మిక తనిఖీలు చేశారు. వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా శనివారం తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల షాపులను తనిఖీలు చేశారు. పట్టణంలో ఉన్న అన్నదాత, ఉష ఆగ్రోసీడ్స్ అండ్ పెర్టిసైడ్స్ షాపులో తనిఖీలు చేశారు. నాణ్యత లేని ఎరువులు విత్తనాలు పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణం ముందు ధరలు పట్టిక పొందుపరచాలన్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న వాటిని మాత్రమే విక్రయించాలన్నారు. నిల్వ విక్రయ సరఫరాదారుల ఇన్వాయిసు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఏవో జ్యోతిపాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపాలంలో శనివారం ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ కేంద్రాల్లో విజిలెన్స్ డిపార్ట్మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. జిలెన్స్ ఇన్స్పెక్టర్ శివన్న నారాయణ మాట్లాడుతూ ఈ తనిఖీలో భాగంగా పచ్చికాపలం గ్రామంలో గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరూ అనుమతి లేకుండా ఎరువులను విక్రయించకూడదని ఆదేశించారు. ఆత్మ డిపిడి కే.చంద్రశేఖర్ విమండల వ్యవసాయ అధికారి వనిత పాల్గొన్నారు.

సహకారం ద్వారా మెరుగైన భవిష్యత్తు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: సహకారం ద్వారా రైతులకు మెరుగైన భవిష్యత్తు ఉంటుందని జిల్లా సహకార శాఖ విభాగ అధికారి యు.వనజ అన్నారు. శనివారం 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరి పీఏసీఎస్‌కు విచ్చేసిన ఆమె సహకార పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలు అంతర్జాతీయ దినోత్సవాన్ని జరుపుకుంటోందన్నారు. అందరికీ మంచి భవిష్యత్తును అందిస్తామన్న ధీమాతోనే ఈ దినోత్సవం జరుగుతోందన్నారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అమలు చేయడానికి ప్రయత్నాలు వేగవంతం చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నగరి, కోసలనగరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు కేవిఆర్ కుమార్, రమణయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రారు సులోచన, నగరి, అగరం రామకృష్ణ సీఈవోలు కె.తులసిపిళ్లై, జి.సుబ్రమణ్యం, నగరి బ్రాంచి మేనేజరు సందీప్, సూపర్‌వైజర్ ఆనందన్, సొసైటీ సిబ్బంది గుణశేఖర్, లేపాక్షి, శేఖర్, దుర్గాప్రసాద్, కార్తిక్, తనికాచలం, వరప్రసాద్ రాధ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: రైతుల భవిష్యత్తు సహకార సంఘం ప్రధాన లక్ష్యమని గంగాధర నెల్లూరు సింగిల్ విండో పర్సన్ ఇన్చార్జి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శనివారం 102వ అంతర్జాతీయ సహకార సంఘ దినోత్సవం సందర్భంగా గంగాధర నెల్లూరు సింగిల్ విండో కార్యాలయంలో సహకార సంఘం జెండా ఎగురవేసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. సహకార సంఘం ద్వారా రైతులకు మంచి జరగాలని, వారి పురోభివృద్ధి ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు. సింగిల్ విండో సీఈఓ విజయ్ కుమార్‌రెడ్డి, డిసిసిబి బ్యాంకు మేనేజర్ మహేష్, బ్యాంకు సూపర్‌వైజర్ విజయ, సింగిల్ విండో స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి, బాబు, హరిబాబు పాల్గొన్నారు.



జెండాను ఎగరవేస్తున్న పర్సన్ ఇన్చార్జి శ్రీనివాసులు రెడ్డి

క్రైం న్యూస్

టూరిస్టు బస్సు బోల్తా

ఇద్దరు దుర్మరణం





ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు బయలుదేరిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో బోల్తా పడిన సంఘటన శనివారం మండల పరిధిలోని బసవరాజు కండ్రిక సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, 21 మంది గాయపడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. కర్ణాటక రాష్ట్రం తుముకూరు జిల్లా పావగడ తాల్లూకాకు చెందిన బాబు అనేవ్యక్తి ప్రయివేటు టూరిస్టు ఏజెంటుగా పనిచేస్తున్నాడు. అతని ఆధ్వర్యంలో దక్షణాది -రాష్ట్రాల్లో ఉన్న పుణ్యక్షేత్రాల సందర్శనకుగాను ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భక్తులు సుమారు 50మందితో పేరూరు నుంచి శుక్రవారం రాత్రి పది గంటలకు బయలు దేరారు. అనంతపురంకు చెందిన రఫీక్ అనేవ్యక్తి ప్రయివేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సులో ఏజెంట్ బాబు, అతని అసిస్టెంట్ చలమారెడ్డి (డ్రైవర్) బస్సుఓనర్ అన్వర్బన్‌లతోసహా బయలుదేరారు. శనివారం ఉదయం కాణిపాకం వెళ్లాలని నిర్ణయించుకుని వేకువజామున సుమారు 4.30గంటల ప్రాంతంలో పుంగనూరు-పలమనేరు జాతీయ రహదారిలో ఉన్న బసవరాజుకండ్రిగ వద్ద వస్తుండగా బస్సు డ్రైవర్ వేగంగా నిద్రమత్తులో అజాగ్రత్తగా నడపడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు ప్రక్కనే వున్న ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొని ఒక్కసారిగా బోల్తాపడింది. ఏమి జరుగుందో తెలుసుకునేలోపలే బస్సులో ఉన్న సత్యసాయి జిల్లా రొద్దం పంచాయతీ చిన్నగువ్వలపల్లికి చెందిన రామంజమ్మ (58), కర్ణాటక రాష్ట్రం, తుముకూరు జిల్లా, పావగడ తాల్లూక మురరాయనిహళ్ళికి చెందిన నరసింహరెడ్డి(68) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే 21 మందికి తీవ్రగాయాలైయ్యాయి. జాతీయ రహదారిలో ప్రమాదం జరిగిన విషయం గుర్తించిన ఇతర ప్రయానికులు, స్థానికులు 108కు సమాచారం అందించడంతో 108వాహనంలో క్షతగాత్రులను పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు సైతం గాయాలు కాగా ఆసుపత్రిపాలయ్యాడు. సమాచారం అందుకున్న సిఐ క్రిష్ణమోహన్ ఆయన సిబ్బంది సంఘటనాస్థలం చేరుకుని సంఘటన జరిగిన తీరుపై బస్సులోని వారు, ఏజెంట్ బాబును విచారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా జరిగిన సంఘటనపై రాష్ట్ర రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందించి ప్రమాదఘటనపై సంబంధిత శాఖ అధికారులతో చరవాని ద్వారా సంఘటనపై ఆరా తీశారు. ప్రమాదాలకు గలకారణాలు మృతులు, క్షతగాత్రుల వివరాలను నివేదిక రూపంలో తనకు అందించాలని ఆదేశించారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైనవైద్య సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

అంగన్వాడీ స్థలం కబ్జా



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి గ్రామపంచాయతీ రామనపల్లి గ్రామంలో అంగన్వాడీ నూతన భవన నిర్మాణం కొరకు రెవెన్యూ సిబ్బంది స్థలం కేటాయించి అంగన్వాడీ సిబ్బందికి అప్పగించారు. అయితే ప్రస్తుతం ఆ గ్రామంలో ఉన్న కొంతమంది వ్యక్తులు ఆ స్థలాన్ని కబ్జా చేశారు. దీంతో గ్రామస్తులు విఆర్ఓ వెంకటేష్‌కు ఫిర్యాదు చేయగా విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి తహశీల్దార్ స్వర్ణలత శనివారం రామనపల్లి గ్రామానికి చేరుకొని స్థలం కబ్జాచేసిన వారితో మాట్లాడారు. ఈ స్థలం తమదే అని, తాముంటున్న ఇంటికి దారి కావాలని వారు తెలిపారు. అక్కడే ఉన్న గ్రామసర్వే వీఆర్వో కలసి సర్వే నిర్వహించగా సర్వేకి కబ్జా చేసిన వారు నిరాకరించారు. వారు గ్రామస్తులతో మాట్లాడి వేరే స్థలం కానీ, జిల్లా సర్వేయర్ ద్వారా సర్వే చేస్తే ఈ స్థలం పోరంబోగా గుర్తిస్తే వదిలేస్తామని, అంతవరకు టైం కావాలని తహశీల్దార్‌ను కోరగా తహశీల్దార్ బుధవారం వరకు టైం ఇచ్చినట్లు తెలిపారు

సింగల్ విండో ఛైర్మన్‌కు పితృవియోగం

ప్రజాశక్తి- వెదురుకుప్పం

మండలంలోని చవటగుంట సింగల్ విండో ఛైర్మన్ ఆళ్ళమడుగు గ్రామానికి చెందిన కామసాని లోకనాథ్‌రెడ్డి తండ్రి కామసాని అప్పిరెడ్డి (120) సంవత్సరాలు శనివారం సాయంత్రం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దహన క్రియలు ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామమైన ఆళ్ళమడుగులో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్యే థామస్ పరామర్శ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని జీడీనెల్లూరు నియోజకవర్గం టిడిపి ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు బీఎం.రవి తల్లి శుక్రవారం ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శుక్రవారం రాత్రి వేణుగోపాలపురం గ్రామానికి వెళ్లి ఏఎంసీ మాజీ డైరెక్టర్ రవి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు.

250 మామిడి చెట్లు నరికివేత

రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని టి.గడ్డురు గ్రామానికి చెందిన జి.నారాయణప్పకు చెందిన 250 మామిడి చెట్లను గుర్తు తెలీని వ్యక్తులు శుక్రవారం అర్థరాత్రి నరకివేశారని, దీంతో రూ. 3లక్షలకు పైగా నష్టం వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ కృష్ణయ్య జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి- సోమల

మండలంలోని ఇరికిపెంట పంచాయతీ పార్వతీనగర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మేనక ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టారు. జిల్లా, మండల అధికారుల ఆదేశాల మేరకు గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత పిచ్చి మొక్కలు తొలగించడం మురుగునీటి కాలువలలో చెత్తాచెదారం తొలగించడం చేపిస్తున్నామన్నారు. గ్రామస్తులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించామని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని అధిక విరోచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తప్పక త్రాగాలని తెలియజేసినట్లు తెలిపారు.